శ్రీ చందు సుబ్బారావు

హస్తిమశకాంతరం

'మహారాజరాజశ్రీ రాజమాన్య రాజపూజితులు, అత్యంత గౌరవనీయులు, మిక్కిలి ఘనవంతులూ అయిన శ్రీరామచంద్రరావు గారి దివ్య సముఖమునకు' — అనిరాసి, ఒక గంటసేపు ఆలోచించిన తర్వాత ఆ వాక్యం కొట్టివేసాడు సూర్యనారాయణ.

'ప్రియమైన రామచంద్రరావుకు' అని ప్రారంభించాడు.

నీ స్నేహితుడు సూర్యనారాయణ వ్రాయునది ఇంతటి గొప్పవాడవు మహారాజువి అయిన నిన్ను సంబోధించి ఈ ఉత్తరం వ్రాయటానికే భయపడుతున్నాను. ఇది ఎంత అపచారమో ఊహించలేకున్నాను. కాని నిన్ను అత్యంత గౌరవంగా సంబోధించి వ్రాస్తే, అసలు నేనెవరో కూడా గుర్తించలేక నీ సహాయాన్ని, కరుణా కటాక్షాన్ని నిత్యం కోరే కోటానుకోట్ల ప్రజల్లో ఒకడిగా ఉత్తరం నీ కార్యదర్శులు అవతల పారేస్తారని శంకించి మాత్రమే ఇలా వ్రాస్తున్నాను.

నా ఈ దోషానికి ఏ దండనకైనా సంసిద్ధుడను నువ్వు నా శిరస్సు ఖండించమని ఆజ్ఞాపిస్తే అదిచాలు, ఈ జన్మ తరించటానికి. నీ పేరు ఉచ్ఛరిస్తూ కడసారి శ్వాస వదుల్తాను.

మా బ్రతుకులొక బ్రతుకులా రామచంద్రా. నీబోటి శ్రీరామచంద్రుల పాద ధూళి ఏరుకుని మా శిరస్సుల మీద జల్లుకుంటే పది జన్మలకు ముక్తి. రక్తి. సూక్ష్మజీవులమై పుట్టి, నికృష్ట జీవులుగా గిట్టే నాబోటి వాళ్ళకు స్నేహితుడవని చెప్పకోవడం కూడా నీకు అవమానం కాదా 'రామం'.

చూసారా 'రామం' అంటున్నాను. అంటాను. నేటికి యాభై ఏళ్ళనాడు మారేడుపల్లి జిల్లా బోర్డు హైస్కూల్‌లో నాతో పాటు ఆరేళ్ళు కలిసి చదువుకున్న నేరానికి ఇలా అవమానిస్తున్నాను. అలనాడు కుచేలుడు 'కృష్ణా' అన్నాడు. కాని ఆయన పరమ భక్తుడు. భాగవతోత్తముడు. నిత్యం తన స్నేహితుణ్ణి హృదయంలో పూజించిన వ్యక్తి. మరి నే నంతటి వాణ్ణా.

లేదు రామం. లేదు. అహంకారిని. సిగ్గుమాలిన వాణ్ణి. అప్పట్లో నిన్ను ఆశ్రయించి సహాయం కోరమని నా భార్య సతపోరినా అభిమానం అడ్డొచ్చి ససేమిరా వీల్లేదన్నాను. ఈ వేళయినా వచ్చి నీ కాళ్ళమీద పడకుండా ఉత్తరం వ్రాస్తున్నాను. ఉత్తరాలు, వర్తమానాలు పంపటానికి నీ సామంతరాజునా రామం. కనీసం సమహోదాకల్గిన వాణ్ణయినా కానే. ఎంతకు సాహసిస్తున్నానో తలుచుకుంటే గుండె ఆగిపోయేటట్లుంది.

రిటైర్డైన గుమస్తా పీనుగును. కొడుకులు వదిలేసి వెళ్ళిపోతే, పింఛనుతో బ్రతకలేక అయినవాళ్ళ కానివాళ్ళ పంచల్లో తల దాచుకుంటున్న వాణ్ణి. ఈ దేశానికి రాజు నా స్నేహితుడంటే ఎవరయినా నమ్ముతారా రామం.

ఎవరూ నమ్మక్కర్లేదు. నువ్వు నమ్మితే చాలు. నువ్వు నన్ను గుర్తుపడితే చాలు. అలనాడు మారేడుపల్లిలో దొంగతనంగా చెరుకులు కోసుకుని చెరి ఒకవైపు కొరుక్కుతిన్నామని —

చెరువులో ఈతలువేసి రుద్రయ్య పంతులుగారి చేత ఒకే బెత్తంతో దెబ్బలు తిన్నామని,

తాటికాయంత అక్షరాల్తో 'కమల' పేరు హైస్కూలు గోడల మీద వ్రాసి హెడ్మాస్టరుతో చివాట్లు తిన్నామనీ గుర్తుందా. కమలమ్మ తల్లి నిన్ను చేబట్టి కల్యాణమాడినందున, నువ్వు చేసిన అల్లరి మర్చిపోయుంటుంది. కాని ఆ అల్లరిలో భాగం పంచుకున్న ఈ దౌర్భాగ్యుణ్ణి క్షమించిందో లేదో. పాల సముద్రం వంటి కమలమ్మ హృదయాన్ని ఆనాడు గాయపరిచిన పాపమేనేమో రామచంద్రా — ఇంట్లో ఇల్లాలితో ఒక్క మంచి మాటకూ, మనశ్శాంతికీ నోచుకోలేదు. నాలుగు దశాబ్దాల కాపురంలో పడి కాలిపోయినా చావని శరీరం ఇది. ఎందుకడుగుతావులే రామచంద్రా...

స్కూల్ ఫైనల్ పరీక్షల్లో నిద్రలేకుండా చదివి, మరునాడు నువ్వు పరీక్ష హాల్లో పడిపోతే మోసుకొచ్చింది ఈ సూరిగాడేనని గుర్తుందా రామం. ఆనాడు మనిద్దరికీ ఆప్తమిత్రుళ్ళా ఉండే వెంకటయ్య, బక్కపలచగా చామనచాయిలో ఉండే మనిషి మొన్నే గుంటూరు జనరల్ ఆసుపత్రిలో కన్నుమూసాడు. కడకు శవాన్ని పుచ్చుకునే వాళ్ళు కూడా లేక, వైద్యులే స్వాధీనపరుచుకున్నారట. బ్రతికుండే రోజుల్లో నేనూ వెంకటయ్య కలిసినపుడు నీ పేరు తప్ప మరో స్మరణ లేదు రామయ్యా.

నిన్ను చూడకపోయినా రోజూ నీ కంఠం వింటూనే వున్నాను. చిరునవ్వు చిందించే నీ సుందరరూపం చూస్తూనే వున్నాను.

రాజ్యాలు తిరుగుతున్నట్టు, రాజులు వస్తున్నట్టు, పోతున్నట్టు, విందులు విలాసాలతో కులాసాగా కబుర్లు చెబుతున్నట్టు చూస్తూనే వున్నాను.

ఇంకా నా రామానికి నేను గుర్తుండకపోతే ఏం ?

రామేశ్వరం పోయిన తర్వాత కూడా ఈ శనీశ్వరుడు నీకు దాపురించకపోతే నష్టమేమీ లేదు కదా.

అసలు నీ తప్పేంటూ ఏమీ లేదు. తప్పంతానాదే జిల్లాబోర్డు ప్రెశిడెంటుగా ఉంటున్నప్పుడు అనేక మార్లు మా ఆఫీసుకు పని గట్టుకుని వచ్చి, కౌగలించుకుని మాట్లాడేవాడివి. అప్పుడు అది నా అర్హత అనుకున్నాను కాని నీ 'మంచితనం' అని భావించలేదు.

నువ్వు రాష్ట్రంలో మంత్రి అయిన తర్వాత ఒకసారి గుంటూరులో ప్రభుత్వ కళాశాల ప్రారంభోత్సవాని కొచ్చినప్పుడు నన్నుచూసి 'హలో' అని వెళ్ళిపోయావు. అహం దెబ్బతిన్నవాణ్ణయి నిష్ఠూరం పెంచుకున్నానే కాని, నీ కాలం ఎంత విలువైనదో నువ్వు నా లాంటి ఎన్ని లక్షల మందిని రోజుకు 'హలో' అని పలకరించాలో గ్రహించలేక పోయాను.

తర్వాత పదేళ్ళకు అరవై అయిదులో కామోసు. నువ్వు భారతదేశం యావత్తుకూ మంత్రివై విజయవాడ విచ్చేసినప్పుడు నేను పనిగట్టుకొచ్చి నీ కళ్ళకు కనిపించాను. అప్పటికే నా నెత్తి మీద జుట్టంతా పోయింది. బుగ్గలు చొట్టలు పడ్డాయి. ఉన్నకాస్త జుట్టూ నెరిసిపోయింది. నువ్వు గుర్తుపట్టలేదు. కాలం కఠిన హృదయానికి మన స్నేహం బలయిపోయిందని ఆ క్షణంలోనే గుర్తించాను రామూ. నన్ను చూసిన నీ కళ్ళు కదిలిపోతుంటే, మణిమాణిక్యాలు జారిపోతున్నట్లూ, నా సామ్రాజ్యం కాలిపోతున్నట్లూ అనిపించింది. నా 'అహం' పూర్తిగా చచ్చిపోయింది. సూటిగా నీ దగ్గరకొచ్చి చాటుగా తీసుకువెళ్ళి కౌగలించుకోవాలనిపించింది.

తెలిసిన వాళ్ళంతా నిన్ను కలుసుకోమని ఎన్నోసార్లు హెచ్చరించారు. పెద్దవాడి ఉద్యోగం సందర్భంలోనూ, రెండోవాడి ట్రాన్స్‌ఫర్ కోసరమూ, నా ప్రమోషన్ విషయంలోనూ నిన్ను ఆశ్రయించమన్నారు. అహం చచ్చిపోయిన నన్ను సిగ్గు వెంటాడింది.

అప్పులు తీర్చటానికి అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకున్న ఈ చేతులు నీకు ఒక్కసారి నమస్కరించలేకపోయాయి. ఆఖరికి రిటైరయినప్పుడు పింఛను గొడవల్లో పడి ఏడాదిపాటు రాకపోతే ముసలి వాళ్ళిద్దరమూ, పెళ్ళికాని కడగొట్టు ఆడపిల్లా అర్ధభోజనా అనుభవిస్తూ కూడా 'రామూ' అనలేకపోయాను.

నేను క్రిందికి దిగజారే కొద్దీ నువ్వు దూరమైపోయావు. అందని పండువైపోయావు రామం. ఏళ్ళు గడచిపోయాయి. ఊళ్ళు నగరాలైపోయాయి. బళ్ళు ఓడలైపోయాయి నా రామం ఈ దేశానికి రాజుగా ఎన్నికయ్యాడన్న వార్త విని...

రామూ...సుగుణాభి రామా ... మా హృదయాభి రామా ... అనుకుంటూ పార్కులో వెర్రిగా తిరిగాను. నా స్నేహితు లిద్దరు ముగ్గురికి కాఫీ లిప్పించాను. కనిపించినవాళ్ళకల్లా చెప్పాను. 'నాకు ఆయన బాగా తెలుసుననీ...చిన్ననాటి స్నేహితుడనీ' చెబితే 'ఆప వయ్యా హరి కథలు' అన్నారు రామం. పరిహాసం చేసారు. కుర్ర వాళ్ళు ఫక్కున నవ్వారు.

మన పరిచయానికి సాక్ష్యంగా మిగిలిన ఒకే ఒక్క వస్తువు మన స్కూల్ ఫైనల్ ఫొటో — తీసుకువెళ్ళి చూపిద్దును కాని — నా దరిద్రానికి చిహ్నంగా అదెప్పుడో ఏదల పాలయ్యింది. పోతే పోయింది. నా గుండెల్లో బొమ్మలేదూ, అది చెరిగి పోతుందా— నా దరిద్రం దాన్ని కరిగించేయ కలదా.

ఈ నా సొదకేంగాని రామచంద్రయ్యా...

నువ్వు రోజూ ముప్ఫయి కూరల్తో భోంచేస్తావటగా. నీ భవంతిలో మూడు వందలమంది బంట్రోతు లుంటారటగా. నీ ఇంటి చుట్టూ తోట మన మారేడుపల్లి అంత ఉంటుందా. ఒక్కసారి నువ్వు ఇతర దేశ నాయకుడికి విందుచేస్తే లక్ష రూపాయ లవుతాయటగా రామూ. లక్ష రూపాయలు! నా బోటివాడు మూడు జన్మ లెత్తినా లక్ష రూపాయల ఖరీదు చెయ్యడు కదూ.

రామం —

ప్రతి వస్తువుకీ ధరలిలా మండిపోతున్నాయ్. ప్రజలు అలమటిస్తున్నారు. ఉన్నవాడిది రాజ్యమైపోయింది. జనం ఇల్లూ వాకిలీ అమ్మక అల్లాడిపోతున్నారు. నువ్వొక్క కలం గీటుతో మార్చెయ్య లేవా రామచంద్రా ...

పిచ్చిగా వ్రాస్తున్నాననుకో. నీ ఇబ్బందులు నీ కుంటాయి. కాని రామచంద్రా ... అంతా నీ క్రిందవాళ్ళేనట గదా. కనీసం ఈ ముసలి పింఛనుదార్లకయినా సకాలంలో పింఛనిప్పించే ఏర్పాటు చెయ్యలేవూ. పీనుగులమీద పిశాచాల్లా ఈ అరవై రూపాయల్లోనే లంచమడిగేవాళ్ళను కొరత వేయించలేవూ.

ఇవన్నీ నీకు కూర్చోబెట్టి చెబుదామనుంది. మళ్ళీ నీకు తెలియకుండా ఉంటాయా. పత్రికలు, రేడియో, గూఢచార్లు చెబుతారు కదా అనిపిస్తుంది.

రామం. నమ్ము, నమ్మకపో. పదవిలో ఉన్నావు కనుక భక్తి ఒలకబోస్తున్నాననుకున్నా సరే. నువ్వు విమానంలో వచ్చినట్టు, వందల మంది పోలీసులు బందోబస్తు చేసినట్లు, ఊరంతా తిరిగి మా యింటి కొచ్చి నాతో భోంచేసినట్లు గంటలు గంటలు మాట్లాడినట్టు కలలొస్తాయి ఎందుకో. ఈ అల్పుడికా కోర్కె మనస్సులో ఉండిపోయి అలా వస్తున్నాయేమో అనుకుంటాను.

చచ్చిపోయేముందు నిన్ను చూడాలని వుంది. నీ భార్యామణి కమలమ్మను కళ్ళారాచూసి ఆనందించాలని వుంది. నాకు ఏ సహాయమూ వద్దు. నీ దగ్గరకుపోయి చేయి చాచి ఏదైనా అడగమంటారు వీళ్ళు. నా భార్య అయితే వెళ్ళొద్దనే అంటుంది!

'వయసున్నప్పుడు ఒక్కసారిపోయి ప్రాధేయపడమంటే వెళ్ళ లేదు. ఈ ముసిలితొక్కు ఆయనకు గుర్తా, పాడా. ఢిల్లీకి కాదు వల్లకాటికి పో' అని శాపనార్థాలు పెడుతుంది.

అయినా నీ వైభవం, ఠీవి, రాజరికం చూసిన తర్వాత ఈ కళ్ళు కదలవు. ఈ గుండె ఆడదు. ఈ చెయ్యి లేవదు. పార్వతీ పరమేశ్వరులవంటి మీ యిద్దర్నీ చూసిన తర్వాత కూడా ఈ పాపిష్టినోరు మాట్లాడుతుందనుకోను.

మొన్న మా వూరు మీదుగా నువ్వూ, నీ బలగమూ బందరు దివిసీమకు వెళుతున్నావని తెలిసి నీ దర్శనంకోసం ఎండలో నాలుగ్గంటలు నిలుచున్నాను. ముందు ముప్ఫయి కార్లు, వెనక ముప్ఫయి కార్లు-మధ్యలో మహారాజులా నిలబడ్డ నిన్ను చూద్దామనుకుని ముందు కడుగు వెయ్యబొయ్యేంతలో వెనక్కు నెట్టేసారు పోలీసులు. కళ్ళజోడు పడిపోయింది.

క్రిందికి వంగి కళ్ళజోడు తడుముకునేంతలో శ్రీరాముడు వెళ్ళిపోయాడు. కన్నుమూసి తెరిచేంతలో కనుమరుగై వెళ్ళిపోయాడు.

మళ్ళీ చూస్తానో లేదో, ఈ జన్మకు అనిపించింది.

అందుకని తెగించి ఈ జాబు వ్రాస్తున్నాను. నాకు ఆ ఢిలీ ముక్కూ మొహం తెలియదు రామచంద్రా. రాజభవంతికి చేరతానో లేదో, అనుమతి లభిస్తుందో లేదో, నా మనస్సు గ్రహించి లోనికి రప్పిస్తావు కదూ. కమలమ్మను చూపిస్తావు కదూ.

నీ పాదరేణువుకు తులతూగే
నీ చిన్ననాటి స్నేహితుడు.
కె సూర్యనారాయణ వ్రాలు

ఉత్తరం ముగించి, కాగితాలు మడిచి కవరు కొనటానికి డబ్బులకై జేబులో వెదికాడు సూర్యనారాయణ. లేవు.

పెట్టె అడుగున ఏదైనా పావలా బిళ్ళ దొరుకుతుందేమో అని ట్రంకుపెట్టె తెరిచాడు. పెట్టెమోత పెట్టేసింది భార్య కాంతమ్మ.

'ఏంటి, వెతుకుతున్నావ్' వంటింట్లోంచి కేకవేసింది. సూర్యనారాయణ తటపటాయించాడు.

'నిన్నే అడుగుతుంట. పెట్టెతో పనేమొచ్చిందంటున్న' కాంతమ్మ గొంతులో అదిలింపు ధ్వనించింది.

'రామచంద్రయ్యకు ఉత్తరం వ్రాద్దామని...డబ్బులేవైనా ఉంటే కవరొకటి కొనుక్కొద్దామని...' భయపడుతూ సూర్యనారాయణ గొణిగాడు...'ఏం మాటలు వినబోతున్నానో' అనుకుంటూ...మాటలు పూర్తి కాకుండానే కాంతమ్మ లేచొచ్చి,

'ఓసి నీ ముసలాడు చావ. ఈ పిచ్చి ఒదల్దు కదా ఈయనకి. రామచంద్రయ్యట రామచంద్రయ్య. ఈయన పిన్నత్త కొడుకులాగా. ఢిల్లీ పోతాడంట ముహం. ఏనిగలొచ్చి దండేసి ఎక్కిచ్చి కెళతాయి. పింఛను గుమ్మాస్తా ఒచ్చాడని...ఇటియ్యదసలు...' ఉత్తరం లాక్కుని చించి కాలే కాలే పొయ్యిలో పారేసింది.

'ఢిల్లీ పోతాడంట. పోలీసోడు లాటీతో డొక్కలో పొడిస్తే గుటుక్కుమంటావు. నా మొహానికి ముండరాత కూడాను. దమ్మిడీ తేటం చేతకాదు...పొద్దున్నుంచి కూచుని చిట్టారాసాడుచూడూ...'

మంటల్లోని అక్షరాల్ని చూస్తూ 'సెలవు' అని దణ్ణం పెట్టాడు సూర్యనారాయణ!

ఆంధ్రపత్రిక
సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక

మ న వి

ఎప్పటిలాగే ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక) కి తమ రచనలు పంపవలసిందిగా రచయిత (త్రు) లకి మనవి చేసుకుంటున్నాము.

రచనలు జనవరి ఆఖరిలోగా మాకు చేరేట్లు పంపాలని కోరుకుంటున్నాము.

కవరుమీద, వ్రాతప్రతిమీదకూడా స్పష్టంగా "ఉగాది సంచిక"కి అని రాయాలని మనవి చేసుకుంటున్నాము.

స ం పా ద కు డు.